విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



కళాశాల ప్రాంగణ గేటును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్‌ తదితరులు

శంషాబాద్‌: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో గురువారం జరిగిన ఫ్రెషర్స్‌ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్‌ పార్టీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అన్నీ రంగాల్లో మెళుకువలు సాధించాలని, విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా బదిలీలైన అధ్యాపకులకు సన్మానం చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణానికి కొత్తగా ఏర్పాటు చేసిన గేటును ప్రిన్సిపాల్‌ మాధవరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పార్కులను అభివృద్ధి చేస్తాం



పార్కులో మొక్కలు నాటిన కమిషనర్‌, వైస్‌ చైర్మన్‌లు

మణికొండ: లక్ష్మీనగర్‌ కాలనీలోని బటర్‌ ఫ్లై పార్కులో గురువారం కౌన్సిలర్‌ బి. శ్వేతరవికాంత్‌రెడ్డితో కలిసి మున్సిపల్‌ కమిషనర్‌ డి. ప్రదీప్‌కుమార్‌, వైస్‌ చైర్మన్‌ కె. నరేందర్‌రెడ్డిలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి చేయాల్సిన పార్కులన్నింటినీ రాబోయే రోజుల్లో నందన వనాలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ దివ్య జ్యోతి, బీజేపీ నాయకులు అంజన్‌ కుమార్‌గౌడ్‌, సి.బీరప్ప, ఎం. రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కృష్ణమాదిగను సన్మానించిన ఎమ్మార్పీఎస్‌ నాయకులు

మణికొండ: మాదిగల ఏబీసీడీ వర్గీకరణను సుప్రీం కోర్టు తీర్పు ద్వారా సాకారం చేసిన మంద కృష్ణమాదిగకు ఎమ్మార్పీఎస్‌ నాయకులు సన్మానం చేశారు. గురువారం ఎమ్మార్పీఎస్‌ జిల్లా ఇంచార్జి పి. గణేష్‌మాదిగ నేతృత్వంలో ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్‌మాదిగ మాట్లాడుతూ.. దశాబ్దాల తరబడి తన వాదనను ఢిల్లీ వరకు వినిపించి ఎట్టకేలకు మాదిగ 57 ఉపకులాల వర్గీకరణ సాధించటం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్‌ మాదిగ, మల్లప్ప మాదిగ, బిక్షపతి మాదిగి, శ్రీనివాస్‌ మాదిగలు పాల్గొన్నారు.

కేటీఆర్‌ దీక్షలో..



కేటీఆర్‌, స్వామిగౌడ్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్‌ నాయకుడు

బండ్లగూడ: చేవెళ్ల లో గురువారం కేటీఆర్‌ తలపెట్టిన దీక్షకు మున్సిపల్‌ కార్పొరేషన్‌ బీఆర్‌ఎస్‌ నాయకులు కాళీమందిర్‌లో పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున చేవెళ్ల బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా బీఆర్‌ఎస్‌ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేటీఆర్‌ రైతులకు పది సంవత్సరాలలో ఎంతో మేలు చేశారని అన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

వినతి పత్రం అందజేత



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీపీ తదితరులు

శంషాబాద్‌: రెండు లక్షల వరకు రుణమాఫీ హామినిచ్చిన రాష్ట్ర సర్కారు రైతులను దగా చేస్తోందని మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్‌ అన్నారు. రుణమాఫీలో కొర్రిలు పెట్టి వేలాది మంది అన్నదాతలకు లబ్ధి చేకూరకుండా చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్‌ కార్యాలయంలో డీసీసీ డైరెక్టర్‌ బూర్కుంట సతీష్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం చేవెళ్లలో జరిగిన మాజీ మంత్రి కేటీఆర్‌ ధర్నాకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు దిద్యాల శ్రీనివాస్‌, బీఆర్‌ఎస్‌ మండల ప్రధాన కార్యదర్శి మంచర్ల మోహన్‌రావు, కో–ఆప్షన్‌ సభ్యులు గౌస్‌ పాషా, రాజేందర్‌, రాజశేఖర్‌గౌడ్‌, జిల్లా శ్రీనివాస్‌, గోపాల్‌, జంగయ్య, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీకార్పొరేషన్‌ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌ శిక్షణ

శంషాబాద్‌: జిల్లా ఎస్సీకార్పొరేషన్‌ ఆధ్వర్యంలో ఎస్సీ నిరుద్యోగ యువకులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీకార్పొరేషన్‌ ఓ ప్రకటనలో వెల్లడించింది. డ్రైవింగ్‌, ట్రెనింగ్‌ ఇనిస్టిట్యూట్‌, టీఏ, జెడ్‌ఎస్‌టీసీ హకీంపేటలో లైట్‌వెహికిల్‌, మోటార్‌ వెహికిల్‌, హెవీ మోటార్‌ వెహికల్‌ డ్రైవింగ్‌లో మొత్తం 38 రోజుల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం వారికి శాశ్వత లైసెన్స్‌ను ఇవ్వనున్నారు. అవసరమైన వారికి భోజనంతో పాటు వసతి సౌకర్యముంటుందన్నారు. 20 ఏళ్లు నిండిన అర్హులైన యువకులు జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలోని ఎస్సీ కార్పొరేషన్‌ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. కుల, రేషన్‌ కార్డు, ఆధార్‌ కార్డుతో పాటు తదితర పత్రాలను తీసుకు రావాలన్నారు. హెవీ మోటార్‌ లైసెన్స్‌ శిక్షణలో చేరాలనుకునే వారికి లైట్‌ మోటార్‌ వెహికల్స్‌ లైసెన్స్‌ ఏడాది పూర్తై ఉండాలని తెలిపారు. మిగతా డ్రైవింగ్‌ శిక్షణకు సంబంధిత లెర్నింగ్‌ లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు.

కాస్ట్‌ ఆఫ్‌ కల్టివేషన్‌ జాతీయ సదస్సు ప్రారంభం



పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు



పంటల వివరాలను విడుదల చేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కాస్ట్‌ ఆఫ్‌ కల్టివేషన్‌ పథకం జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సదస్సులో కేంద్ర వ్యవహారాల రైతు సంక్షేమ శాఖ ముఖ్య ఆర్థిక వ్యవహారాల సలహాదారుడు డాక్టర్‌ దేవాజీత్‌ కౌండ్‌ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు వివిధ పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించడంలో కాస్ట్‌ ఆఫ్‌ కల్టివేషన్‌ పథకంలో పనిచేస్తున్న అధికారులే చాలా కీలకమని అన్నారు. రైతుల నుంచి పంటల సాగు.. ఖర్చుల వివరాలు నాణ్యతతో సమాచారం సేకరిస్తే రైతులకు కనీస మద్దతు ధరలతో మేలు జరుగుతుందని అన్నారు తెలిపారు. ప్రపంచంలో పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించే వ్యవస్థ ఉన్న ఏకైక దేశం భారతదేశం అని అన్నారు. ఈ పథకం సలహాదారు డాక్టర్‌ ధనుంజయ్‌ ప్రసాద్‌ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. పంటల సాగు ఖర్చుల వివరాలు సేకరించనిదే పంటలకు ఖరీఫ్‌, రబీ సీజన్లలో కనీస మద్దతు ధరలు ప్రకటించడం సాధ్యపడదని ఆయన వెల్లడించారు. డాక్టర్‌ సూహాసిని ఈ పథకం యొక్క వివరాలను వివరిస్తూ.. దేశంలోని 19 రాష్ట్రాలలో సుమారు 8100 మంది ఎంపిక చేసిన రైతుల నుంచి పంటల సాగు ఖర్చులను చాలా పకడ్బందీగా సేకరిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ సదస్సులో 19 రాష్ట్రాల నుంచి 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పథకం స్పెషల్‌ ఆఫీసర్‌ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నివాళి



నివాళ్లు అర్పిస్తున్న పోలీస్‌ అధికారులు

బండ్లగూడ: రాజా బహదూర్‌ వెంకట్రామిరెడ్డి 155వ జయంతి సందర్భంగా గురువారం మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని తెలంగాణ పోలీస్‌ అకాడమీలో ఆయన విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. రాజా బహదూర్‌ వెంకట్రామిరెడ్డి 7వ నిజాం కాలంలో హైదరాబాద్‌ కొత్వాల్‌గా దాదాపు 14 సంవత్సరాలు పని చేశారని, ఆయన ఒక కులానికి, ఒక మతానికి సంబంధించిన వ్యక్తి కాదన్నారు. జాతి కోసం పాటుపడిన గొప్ప వ్యక్తని తెలిపారు. పోలీస్‌ అకాడమీ ఇంచార్జి జాయింట్‌ డైరెక్టర్‌ డీ. మురళీధర్‌ మాట్లాడుతూ.. రాజా బహదూర్‌ గొప్ప మహనీయులని, నేటి పోలీసులు ఆయనని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్‌ అభిలాష్‌, డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, నర్మద, సునితా మోహన్‌ రాజా బహదూర్‌ కుటుంబ సభ్యులు, ముని మనవరాలు రుక్మిణి రెడ్డి, అనురాధరెడ్డి మనుమడు వెంకట్‌ రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌ కబ్జాను తొలగించండి



ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న నిర్మాణం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్‌ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్‌ 20లో ప్రభుత్వ భూమి ఉంది. దాన్ని అనాధిగా గ్రామానికి చెందిన దళితులు సాగుచేసుకుంటున్నారు. అందులో తమకు ఇంటి పట్టాలను కేటాయించాలని కోర్టుకు వెళ్లగా తమకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయని గ్రామస్థులు పి. కృష్ణ, పి.గోపాల్‌, నర్సింగ్‌రావు, లక్ష్మణ్‌, జగదీష్‌, వీరయ్యలు తెలిపారు. దాని పక్కనే సర్వే నెంబర్‌ 31లో సెక్రటేరియట్‌ ఉద్యోగులకు 59 ఎకరాల భూమిని కేటాయించి లే–అవుట్‌ చేసి ఇచ్చారన్నారు. అందులో అర్హత లేని వారికి ఇంకా పట్టాలు ఉన్నాయని, కొందకు ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందులో భాగంగా స్థానిక కౌన్సిలర్‌ బి. పద్మారావుకు సైతం 300 గజాల స్థలం కబ్జా చేస్తున్నాడని, దాన్ని తొలగించి భూమిని పరిరక్షించాలని మున్సిపల్‌ కమిషనర్‌కు నెక్నాంపూర్‌ దళితులు ఫిర్యాదు చేశారు. మరోవైపు సర్వే నెంబర్‌ 20లో జరుగుతున్న నిర్మాణాన్ని వెంటనే అడ్డుకుని కూల్చివేయాలని, లేదంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతోపాటు మున్సిపల్‌ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు శంకర్‌, యాదయ్య, బిక్షపతి, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న పాదుపు సంఘం సభ్యులు



పొదుపు సంఘం చేయూత

శంషాబాద్‌ రూరల్‌: అనారోగ్యంతో మృతి చెందిన బాధితుడి కుటుంబానికి పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని జూకల్‌ వాసి వాయిలాల కిరణ్‌కుమార్‌గౌడ్‌ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఇతనికి గ్రామంలోని అభ్యుదయ సమైఖ్య పొదుపు సంఘంలో సభ్యత్వం ఉంది. దీంతో సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి సురక్ష విపత్‌ సహాయం కింద రూ.25వేలు, మరణ ఉచిత సహాయంలో భాగంగా రూ.3వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహా, సభ్యులు పాల్గొన్నారు.

మహనీయుల జాతరను విజయవంతం చేయాలి

రాయదుర్గం: బీసీల మహానేత బీపీ మండల్‌ జయంతిని పురస్కరించుకొని జరిగే మహనీయుల జాతరను విజయవంతం చేయాలని సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్‌ ప్రొఫెసర్‌ ప్రభంజన్‌యాదవ్‌ కోరారు. ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌ మహనీయుల జాతర పోస్టర్‌, కరపత్రంను గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. బహుజన రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని, సామాజిక న్యాయం కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్‌ఏ, సామాజిక న్యాయ జేఏసీ నాయకులు వసుమతి యాదవ్‌, రాకేష్‌,దత్త, ప్రవీణ్‌, లక్ష్మణ్‌, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలి

శేరిలింగంపల్లి: బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని శేరిలింగంపల్లి ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్‌ రజనీకాంత్‌రెడ్డి ఆదేశించారు. గురువారం శేరిలింగంపల్లి సర్కిల్‌ కార్యాలయంలో ఓటరు జాబితా స్పెషల్‌ సమ్మరీ రివిజన్‌ (ఎస్‌ఎస్‌ఆర్‌) 2025 బీఎల్‌ఓ సూపర్‌వైజర్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం నుంచే బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్ళి ఫోన్‌ యాప్‌లో ఓటర్ల వివరాలు నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా ఓటరు జాబితా ప్రకారం ఓటర్లు అక్కడ ఉన్నారా, లేదా ఎక్కడికైనా షిఫ్ట్‌ అయ్యారా, పేరు నమోదులో తప్పులు ఉన్నా, ఓటరు మరణిస్తే కుటుంబ సభ్యులతో వివరాలు తీసుకొని వాటిని నమోదు చేయాలన్నారు. ఓటర్లు కూడ బీఎల్‌ఓలకు పూర్తి వివరాలు అందించి సహకరించాలని కోరారు. ఏఎంసీలు ప్రేమ్‌కుమార్‌, శ్రవణ్‌ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వెంటే మజ్లిస్‌ పార్టీ

గోల్కొండ: మజ్లిస్‌ పార్టీ ఎప్పుడూ ప్రజల వెంటే ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్‌ మొహినుద్దీన్‌ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్‌ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకుడు సయ్యద్‌ రఫత్‌ హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో రిట్‌ పిటిషన్‌

శంషాబాద్‌ రూరల్‌: మండల పరిధిలో ఔటర్‌ రింగు రోడ్డు లోపలి గ్రామ పంచాయతీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడానికి జారీ అయిన మెమోను సవాలు చేస్తూ.. రాష్ట్ర హైకోర్టులో రిట్‌ పిటిషన్‌ దాఖలు చేసినట్లు చిన్నగోల్కొండ మాజీ సర్పంచు గుర్రం పద్మావతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలు, మున్సిపల్‌ కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలను జీహెచ్‌ఎంసీలో కలుపుతున్నట్లు తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌, అర్బన్‌ డెవలప్‌మెంట్‌ ప్రిన్సిపల్‌ సెక్రటరీ ద్వారా మెమో నెం.5924/ఎంఏ/2024 జారీ చేసిందని పేర్కొన్నారు. చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, హమీదుల్లానగర్‌, బహదూర్‌గూడ, రషీద్‌గూడ గ్రామాల తరఫున పిటీషన్‌ వేయగా.. సీనియర్‌ న్యాయవాది వి.రఘునాథ్‌ కోర్టులో వాదనలు వినిపించినట్లు తెలిపారు. గ్రేటర్‌లో విలీనంతో గ్రామాల ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను కోర్టు దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు.

కాంగ్రెస్‌ పార్టీని గుర్తుంచుకోవాలి



కోరని రాజ్‌ కుమార్‌

రాజేంద్రనగర్‌: తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్‌ పార్టీ అందించిన విషయాన్ని కేటీఆర్‌ గుర్తుంచుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు కోరని రాజ్‌ కుమార్‌ వెల్లడించారు. రాజేంద్రనగర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ప్రజల మనోభావాలను గుర్తించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారన్నారు. సోనియా నాడు రాష్ట్రాన్ని ప్రకటించకపోయి ఉంటే నేటికీ తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదని, ఈ విషయాన్ని కేటీఆర్‌ గుర్తుంచుకోవాలని అన్నారు.

ధర్నాకు తరలివెళ్లిన బీఆర్‌ఎస్‌ నాయకులు



రాజేంద్రనగర్‌: చేవెళ్లలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి బుధవారం రాజేంద్రనగర్‌ సర్కిల్‌కు చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ధర్మారెడ్డి, గౌతమ్‌, రాఘవేందర్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో ఉప్పర్‌పల్లి నుంచి ర్యాలీగా బయలుదేరారు. దారి పొడవున కాంగ్రెస్‌ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. రైతుల రుణమాఫీపై కాంగ్రెస్‌ ప్రభుత్వం వైఖరి ప్రదర్శిస్తుందని ఆరోపించారు.

చైన్‌ స్నాచింగ్‌

మణికొండ: వచ్చే జీతం సరిపోక డబ్బు కొరకు ఏకంగా ఓ మహిళ మెడలోని 30 గ్రాముల బంగారు గొలుసును దొంగిలించి స్థానికులకు దొరికి కటకటాల పాలైన యువకుడి ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంధంగూడలో ఉంటున్న విద్యాదేవి కిరాణషాపు నడుపుకుని జీవనం సాగిస్తుంది. ఆమె వద్దకు బుధవారం ఒక వస్తువు కొనుక్కునేందుకని వచ్చిన మొయినాబాద్‌కు చెందిన అనిల్‌(29) ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె గట్టిగా అరవటంతోపాటు గొలుసు తెగకుండా పట్టుకోవటంతో చుట్టు పక్కల వారు వచ్చి అతనికి దేహశుద్ధి చేసి నార్సింగి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి దర్గా ఖలీజ్‌ఖాన్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన ప్రక్రియను నిర్వహిస్తున్న తీరును గురువారం కలెక్టర్‌ ప్రతిమా సింగ్‌ పరిశీలించి పలు రకాల సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిశీలన సకాలంలో పూర్తి చేయాలన్నారు.

దరఖాస్తుల పరిశీలనకు మూడు బృందాలు..

ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కంచేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని కమిషనర్‌ బచ్చలకూరి శరత్‌ చంద్ర అన్నారు. టీమ్‌ మెంబర్లుగా వాణి (టిపిఎస్‌), రాజ్‌కుమార్‌ (ఏఈఈ), మంజులత (మెనేజర్‌)లను నియమించామని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిశీలన సందర్భంగా అది ప్రైవేట్‌ స్థలమేనా లేక ప్రభుత్వ స్థలమా అన్నది పక్కాగా నిర్ధారించుకోవాలన్నారు. అంతేకాకుండా ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్‌ఆర్‌ఎస్‌ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.



ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ ప్రతిమా సింగ్‌



ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిశీలన చేస్తున్న కమిషనర్‌ శరత్‌చంద్ర

ఆర్థిక సాయం అందించిన మాజీ సర్పంచ్‌



వివాహానికి ఆర్థిక సహాయం అందించిన మాజీ సర్పంచ్‌ స్వరూప

మణికొండ: మాజీ ఎంపీటీసీగా జి. నగేష్‌ యాదవ్‌, సర్పంచ్‌గా ఆయన భార్య స్వరూపలు ఆర్థిక పరిస్థితి బాలేక, పెళ్లి ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న వారికి రూ. 11 వేల నుంచి మొదలుకుని రూ. 51 వేల వరకు ఆర్థికంగా సహాయం అందించారు. మరికొంత మంది తమ పిల్లల పెళ్లిళ్లకు కావల్సిన 3 గ్రాముల బంగారు తాళిబొట్టు, 3 తులాల వెండి మెట్టలను అందిస్తూ వచ్చారు. దశాబ్ద కాలం క్రితం ప్రారంభించిన సహాయ కార్యక్రమం గురువారం వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన అమ్ములు కూతురి వివాహానికి మంగళసూత్రం, మెట్టలతో పాటు రూ. 11వేలను అందించటంతో ఆ సంఖ్య ఏకంగా వందకు చేరింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ జి.నగేష్‌ యాదవ్‌ మాట్లాడుతూ.. తమకు కలిగిన దాంట్లో కొంత పేదలకు ఇలాంటి సహాయం చేయాలని పది సంవత్సరాల క్రితం నిర్ణయించి నిర్విరామంగా అమలు చేస్తున్నామన్నారు. వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి వాసులే కాకుండా ఇతర గ్రామాలకు చెందిన పేదలు వచ్చి అడిగిన పలువురికి సహాయం చేశామన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మానసిక తృప్తిని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమాన్ని రాబోయే రోజుల్లో కూడా కొనసాగిస్తామని మాజీ సర్పంచ్‌ స్వరూప అన్నారు.

మహిళా జర్నలిస్టులపై దాడి సరికాదు

రాజేంద్రనగర్‌: సీఎం రేవంత్‌ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళా జర్నలిస్టులపై రేవంత్‌రెడ్డి అనుచరుల దాడి అమానుష చర్య అని రాజేంద్రనగర్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు, కొలన్‌ సుభాష్‌ రెడ్డి, డి.రమేష్‌ ముదిరాజ్‌, జె.చిత్తారి, పి.శ్రీనివాసులు అన్నారు. మహిళలు అని చూడకుండా సరిత, విజయరెడ్డి అనే జర్నలిస్టులను బూతులు తిడుతూ, ఫోన్లు, కెమెరాలు లాక్కొని భౌతిక దాడికి పాల్పడటం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో రేవంత్‌ రెడ్డి వచ్చినప్పటి నుంచి పాత్రికేయుల మీద వరుస దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రజాపాలన అంటే ఇదేనా.. ఇద్దరు మహిళా జర్నలిస్టుల మీద భౌతిక దాడి జరగడం.. పదేళ్ల తెలంగాణ చరిత్ర, అరవై ఏళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. గత కొంతకాలంగా ఈ ఇద్దరు మహిళా జర్నలిస్టులు రేవంత్‌ రెడ్డి అక్రమాలు బయట పెడుతున్నందుకే దాడులు చేసినట్లు ఆరోపించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించండి



భారీ వర్షానికి కోతకు గురైన రోడ్డు

అత్తాపూర్‌: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారి, రోడ్డు మార్గాలు కోతకు గురైయ్యాయి. రహదారుల గుండా ప్రయాణించే వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారు. అత్తాపూర్‌ 143 పిల్లర్‌ సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ చౌరస్తా నుంచి ఉషా మోహన్‌ హాస్పిటల్‌ ప్రధాన రహదారి గుండా హైదర్‌గూడ ప్రాంతానికి వెళ్లే మార్గం అత్యంత దారుణంగా మారింది. దీనికి తోడుగా స్థానికంగా ఆటో స్టాండ్‌ ఏర్పాటు చేసుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మర్మత్తులు వెంటనే చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీబీఐటీ వద్ద ఆందోళన

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో కొందరు నాన్‌ టీచింగ్‌ స్టాఫ్‌కు జీతాలు పెంచాలని, పీఆర్‌సీలు ఇవ్వాలని గత 15 రోజుల క్రితం ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో కళాశాల నుంచి బయటకు వెళ్తున్న బస్సులను అడ్డుకున్నారు. దీంతో ప్రిన్సిపాల్‌ సీవీ నరసింహులు బుధవారం 6 మందికి నోటీసులు జారీ చేశారు. 48 గంటలలో సంజాయిషీ ఇవ్వాలని, అప్పటి వరకు కళాశాలలోకి రావద్దని అందులో పేర్కొన్నారు. దీంతో వారు తమపై చర్యలు తీసుకున్నారని పేర్కొంటు గురువారం కళాశాల గేటు వద్ద కొద్ది సేపు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర టెక్నికల్‌ కళాశాల అసోసియేషన్‌ సంఘం అధ్యక్షుడు సంతోష్‌కుమార్‌, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్‌ వెళ్లి వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కళాశాల యాజమాన్యం వారు ఇచ్చే వివరణల ప్రకారం మిగతా విషయాలు మాట్లాడతామని స్పష్టం చేసినట్లు వారు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన సెక్యూరిటీ గార్డు

మణికొండ: ఓ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీగా పని చేస్తున్న వ్యక్తి అందులో నివసిస్తున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించటంతో బాలిక తల్లిదండ్రులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేటలోని సన్‌షైన్‌ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న బాలికకు అస్సాం నుంచి వచ్చి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న రనాజ్‌ టాయె తన ప్రైవేట్‌ పార్టులను చూపుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. భయంతో పరుగులు తీసిన బాలిక తన తల్లికి విషయం చెప్పింది. దీంతో తల్లిదండ్రులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. ఈ విషయమై నార్సింగి పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నిస్తే ఎస్సైలు, సీఐ అందుబాటులోకి రాలేదు.

వాహనం ఢీకొని యువకుడి మృతి



అత్తాపూర్‌: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన అత్తాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హుస్సేన్‌, ఏఎస్‌ఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పీవీ నరసింహారావు ఎలివెటెడ్‌ ఎక్స్‌ప్రెస్‌ వే–236 పిల్లర్‌ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా జనరల్‌ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు(35) ఉంటుందని, శరీరంపై పింక్‌ కలర్‌తో కూడిన చెక్స్‌ షర్ట్‌, కాకి కలర్‌ ప్యాంటు ధరించాడని, కుడిచేతిపై అమ్మానాన్న అనే పచ్చబొట్టు, టీఎస్‌కే ఉన్నాయని మృతుడి ఆచూకి తెలిసినవారు పోలీసులను సంప్రదించాలని కోరారు.